కొండెక్కిన రక్షణ గోడల ప్రతిపాదన!

- 70వ వార్డులో జారిపడుతున్న కొండచరియలు
- రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి గత కౌన్సిల్ సమావేశంలో ఆమోదం
- అయినా టెండరుకు నోచుకోని పనులు



చిట్టినాయుడు కాలనీ కొండవాలులో ప్రమాదకరంగా రహదారి

గాజువాక: కొండవాలు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. వాన లొస్తే నానిపోయి ఎప్పుడు ఏ గోడ కూలుతుందో, ఎక్కడ కొండచరియ విరిగి పడుతుందో తెలియని పరిస్థితిలో ఉన్నారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను జీవీఎంసీ విస్మరించినట్లు కనిపిస్తోంది.

ఆమోదం తెలిపినా..

కొండవాలు ప్రాంతాల్లోని పలుచోట్ల రిటైనింగ్ వాల్స్ (రక్షణ గోడల)ను నిర్మించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆమోదించిన టెండర్లను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. ఈ ప్రభుత్వంలోనే సుమారు ఐదు నెలల కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమోదించిన రిటైనింగ్ వాల్స్ నిర్మాణ పనులు టెండర్ల దశకు వెళ్లకపోవడం దీన్ని స్పష్టం చేస్తోంది. ఫలితంగా వర్షాలు వచ్చినప్పుడు కొండప్రాంతాల్లోని ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు.



ఎల్‌బీఎస్‌నగర్‌లో ప్రమాదకరంగా ఇళ్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం

ఇదిలా ఉండగా, వర్షాలు వచ్చినప్పుడల్లా 70వ వార్డులోని కొండవాలు ప్రాంతాల్లోనే ఎక్కువ సార్లు కొండచరియలు జారి పడిపోతున్నాయి. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.20 లక్షలతో ఎల్‌బీఎస్‌నగర్, రూ.10 లక్షలతో దశమికొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మాణం పూర్తి చేసింది. వీటితోపాటు కొండవాలు ప్రాంతాల్లో మౌలిక వసతులను కూడా కల్పించింది. రూ. 50 లక్షలతో డ్రై వర్స్ కాలనీ కొండ చుట్టూ కాలువ నిర్మాణంతో పాటు రూ.15 లక్షలతో ఎల్‌బీఎస్ నగర్ కొండవాలు ప్రాంతంలో, రూ.20 లక్షలతో చిట్టినాయుడు కాలనీ, దశమికొండ కాలనీ కొండవాలు ప్రాంతంలో, 20 **లక్షలతో డ్రైవర్స్ కాలనీ కొండవాలు ప్రాంతంలో మెట్ల మార్గం నిర్మించారు. కాగా, చిట్టినాయుడు కాలనీలో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసింది.** స్టీల్‌రేట్లు పెరిగిపోవడంతో కాంట్రాక్టరు ముందుకు రాలేదు. దీంతో ఆ వ్యయం రూ.20 లక్షలకు పెరిగింది. దమిరిలా ఈ ప్రభుత్వం పాత పనులను రద్దు చేయడంతో ఆ పని కార్యరూపం దాల్చలేదు. ఎల్‌బీఎస్ నగర్‌లో మరో రక్షణ గోడ నిర్మాణానికి గత ఎమ్మెల్యే నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. కరోనాతో ఆ పని ఆగిపోయింది. తర్వాత కాంట్రాక్టరు ముందుకు రాకపోవడంతో టెండరు రద్దయింది. ఇప్పటి ప్రభుత్వం మాత్రం ఆ విషయాలను పట్టించుకోవడం మానేసింది.

రూ.1.86 కోట్ల విలువైన పనులపై నిర్లక్ష్యం

జీవీఎంసీ 70వ వార్డులోని ఆరు రక్షణ గోడలు నిర్మించాలని ఆ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు ప్రతిపాదించారు. దీనికి ఐదు నెలల కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. రూ.1.86 కోట్లతో ఆరు రిటైనింగ్ వాల్స్ నిర్మించాలని నిర్ణయించారు. పరిపాలనా పరమైన ఆమోదం తీసుకొని టెండర్లు పిలుస్తామని చెప్పిన అధికారులు దాన్ని కనీసం పట్టించుకోవడంలేదని చందు ఈ సందర్భంగా తెలిపారు. కొండవాలు ప్రాంతాల్లో నిర్మాణ రేట్లు సవరించినందున కొత్త రేట్ల ప్రకారం టెండర్లు పిలుస్తామని అధికారులు పేర్కొంటున్నారు. అయితే, దీనికి సంబంధించిన ప్రక్రియ మాత్రం ముందుకు సాగడంలేదు.



చిట్టినాయుడు కాలనీ కొండ

ఇదీ ప్రస్తుత పరిస్థితి

చిట్టినాయుడు కాలనీ కొండవాలు ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మించకపోవడంతో వర్షాలకు మట్టి జారిపోతోంది. దీంతో పిల్లలు కింద పడిపోయే ప్రమాదం ఏర్పడింది. ఇంటి నుంచి బయటకు వెళ్లే మార్గంలో మట్టి పెళ్లలు జారిపోతున్నాయి. ప్రమాదకరమైనప్పటికీ చెక్కలు ఏర్పాటు చేసుకొని నడిచి వెళ్తున్నారు. ఎల్‌బీఎస్ నగర్ కొండపై ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి కింద మట్టిచరియలు జారిపోయి రహదారి మొత్తం గాలిలో వేలాడుతోంది.

క్లుప్తంగా

14 నుంచి రథాలమ్మ ఉత్సవాలు

కూర్మన్నపాలెం: కణితి కాలనీలో రథాలమ్మతల్లి మహోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలు ఈ నెల 14 నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. 14న ఉబిడితోలుట, 16న అమ్మవారి పుట్టుక, 17న పురువీధుల్లో అమ్మవారి ఘటాల ఊరేగింపు, 23న తొలేళ్ల పండగ, 24న అమ్మవారి అనుపు ఉత్సవం జరుగుతాయని ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా 23న కేరళ బృందం నెమలిడ్యాన్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఉత్సవ కమిటీ సభ్యులు వేణుబాబు,ప్రగడ శ్రీనివాసరావు, దానప్పలు కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవీఎంసీ -6 అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, వార్డు కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. దోమకాటు వల్ల పలు వ్యాధులు సంభవించే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కోటేశ్వరారావు, ఇన్‌స్పెక్టర్ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో నడుపూరు విద్యార్థిని సత్తా



గీతికను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ తదితరులు

పెదగంట్యాడ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) ఫలితాల్లో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎస్. గీతిక అనే విద్యార్థి రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించిందని పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. గీతికతో పాటు మరో 21 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించారని వివరించారు. ఒకే పాఠశాల నుంచి పెద్ద సంఖ్యలో అర్హత సాధించడం ఇది నాలుగోసారని పేర్కొన్నారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.12వేలు నాలుగేళ్ల వరకూ కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందించనుంది. ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికై న విద్యార్థులను శుక్రవారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో నరసింహ, నారాయణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభం



వికాస్‌నగర్ జంక్షన్‌లో పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల సందడి

పెదగంట్యాడ: డీఎస్సీ పరీక్ష తొలి రోజు మండలంలో శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. వికాస్‌నగర్ జంక్షన్‌లోని ఎస్‌వీఎస్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్‌లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరీక్ష నిర్వహించారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 300 మందికి గానూ 265 మంది హాజరు కాగా, మధ్యాహ్నం 300 మందికి గానూ 275 మంది హాజరయ్యారు.

భర్తపై ఫిర్యాదు

ఉక్కునగరం: భర్త వేధింపులపై భార్య శుక్రవారం స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలివి.. ఎస్‌బీఐ సీనియర్ అసోసియేట్‌గా విధులు నిర్వహిస్తున్న వి. అనితకు 2004లో శ్రీనివాసరావు అనే వ్యక్తితో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. ఆమెకు వివాహం సమయంలో తల్లిదండ్రులు దేశపాత్రునిపాలెంలో 5 సెంట్లు భూమి ఇచ్చారు. ఆమె బ్యాంకులోను తీసుకుని ఇల్లు నిర్మించారు. అప్పటి నుంచి ఆ ఇంటిని తన పేరు మీద మార్చాలని అనితను శ్రీనివాసరావు వేధిస్తున్నారు. గతంలో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా మారకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వైభవంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో శాంతి కల్యాణం చేస్తున్న భక్తులు



అన్న ప్రసాదం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ముత్యాలశెట్టి, త్రిమూర్తులు, కొల్లా అప్పలరాజు, బొండాడ వెంకటేశ్వరరావు, చిట్టూరి వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యవహచనం, పంచగవ్య ప్రాసన, దీక్షా ధారణ, రుత్విక్ వరుణ, గోపూజ, పంచాయతన మండపారాధనతో పాటు శాంతి కల్యాణం నిర్వహించారు. అమ్మవారిని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, డిప్యూటి మేయర్ దల్లి గోవిందరెడ్డి, పలువురు కార్పొరేటర్లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన నాగిరెడ్డి ప్రారంభించారు. సాయంత్రం చండీ హోమం, శ్రీచక్ర నవర్నాన చేశారు. పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాపారావు, వెంకటరావు, ప్రసాద్, వెంకటరమణ, ప్రవీణ్, జగదీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కులుకూరి మంగరాజు, మంత్రి, శంకరనారాయణ, వివిధ ప్రాంతాల ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

గెడ్డలో పూడిక తొలగింపు



పోర్టు వంతెన సమీపంలో ప్రధాన గెడ్డలో పూడికలు తొలగిస్తున్న పొక్లెయిన్

పెదగంట్యాడ: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో పోర్టు వంతెన సమీపంలోని పేరుకుపోయిన పూడికలను పొక్లెయిన్ సాయంతో శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా పోర్టు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ వర్షాకాలంలో గెడ్డలు పొంగిలోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు వస్తుందన్నారు. దీనికి అరికట్టేందుకు వరద నీరు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టామన్నారు.

అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లిన బస్సు

పెదగంట్యాడ: ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న లోయలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన జీవీఎంసీ 64వ వార్డు యారాడ పరిధిలోని కొండ ఆర్చి సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోజూ మాదిరిగానే బస్సు నెంబర్-16 మల్కాపురం మార్గంలో నుంచి యారాడ గ్రామానికి వెళ్లింది. అయితే రాత్రి సమయం కావడంతో మలుపు తిప్పే సమయంలో అదుపుతప్పడంతో పక్కనే ఉన్న లోయలోకి దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ఘటనలో సిబ్బందితో పాటు ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు.



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

‘తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి’

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు కలెక్టర్ హరేందిరప్రసాద్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. 2025 జనవరిలో 1700 మంది కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం తొలగించిందన్నారు. దీనిపై రీజనల్ లేబర్ కమిషనర్ సమక్షంలో 8 సార్లు జాయింట్ సమావేశాలు జరిగినా కొలిక్కి రాలేదన్నారు. యాజమాన్యం వైఖరికి నిరసనగా మే 20 నుంచి కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు సమ్మె చేశాయన్నారు. ఆ సమ్మె కాలంలో కూడా యాజమాన్యం 1541 మంది కాంట్రాక్ట్ కార్మికులను నిలుపుదల చేసిందన్నారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికుల స్థానంలో కొత్త వారిని పనిలో పెట్టుకుంటూ మరో చట్ట ఉల్లంఘనకు పాల్పడుతుందని వివరించారు. సమ్మెలో పాల్గొన్న 1541 మందిని వెంటనే విధుల్లోకి తీసుకొనేలా యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు పి.వి. రమణ, నమ్మి రమణ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగారావు, నాయకులు

విరాళం అందజేత

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం అభివృద్ధికి దాతలు తమ వంతు విరాళాలు అందజేస్తున్నారు. షీలానగర్‌కు చెందిన తాత వెంకట శేషాద్రి, చంద్రసేన దంపతులు శుక్రవారం రూ.11,111 విరాళం అందజేశారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలని వినతి



పార్లమెంటరీ కమిటీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నగేష్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలని స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు పి.వి. నగేష్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన కార్మిక, చేనేత, నైపుణ్యాభివృద్ధి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బసవరాజ్ బొమ్మై, కమిటీ సభ్యులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. యాజమాన్యం ముందస్తు సమాచారం ఇవ్వకుండా వందలాది మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించిందన్నారు. ఈ అంశంపై సమ్మె చేసే సమయంలో కూడా 1480 మంది కార్మికులను తొలగించారన్నారు. ఒకేసారి వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. దీనిపై జోక్యం చేసుకుని వారిని విధుల్లోకి తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 11వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ తెలిపింది.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు 14న రక్తదానం

స్టీల్ సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకై ఈనెల 14న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ అన్నారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం గోడపత్రికను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన ఏడుసార్లు రక్తదానం చేసి స్టీల్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా 1600 రోజులుగా ఐక్య పోరాటాలు చేస్తున్నామన్నారు. కాని ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించి కార్మికుల జీవితాలను, ప్లాంట్ భవిష్యత్తును మరింత సంక్షోభంలోకి నెట్టే విధంగా చర్యలు చేపడుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో కార్మిక వర్గం మరింత ఐక్యంగా తమ రక్తాన్ని దానం చేసి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వాహకులు బి. అప్పారావు మాట్లాడుతూ ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా జూన్ 14న అంబేడ్కర్ కళాక్షేత్రంలో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ నాయకులు పి. శ్రీనివాసరాజు, కె.గంగాధర్, పూర్ణచంద్రరావు, కె. శ్రీనివాస్, కొయిలాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధం



యోగా ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీవల్లి



యోగాసనాలు వేస్తున్న సాధకులు

అగనంపూడి: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధమని గాజువాక తహసీల్దార్ తోట శ్రీవల్లి అన్నారు. అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ (దివ్యజ్యోతి భవనం) ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవ సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దీనిలో అంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ గుడివాడ సుధారాణి, విశాఖ బ్రహ్మకుమారీస్ కోఆర్డినేటర్ బీకే సోమేశ్వరి , అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, బి.శ్రీనివాసరావు, బొండా ఈశ్వరరావు, గంతకోరు సత్యవతి, కోట, నరసింహమూర్తి, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వం.. శ్రీనివాస మయం

వైభవంగా వెంకన్న కల్యాణం



సూర్యప్రభ వాహన సేవలో తిరుమలేశుడు



కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణం తిరుపతిని తలపించింది. భక్తుల గోవింద నామస్మరణతో ప్రాంగణం అంతా మార్మోగింది. ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలోని శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిపారవశ్యంతో నిర్వహిస్తున్నారు. దివ్యక్షేత్రం చైర్మన్ గుత్తికొండ బాలాజీ ఆధ్వర్యంలో ఈ నెల 3న ప్రారంభించిన ఉత్సవాలు 7వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. శుక్రవారం వేకువ జాము నుంచి తిరుమలేశునికి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమయ్యాయి. మూలమూర్తికి అభిషేకం, శ్రీవారి అలంకరణ, నిత్య అర్చన అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించారు. ఉదయం తిరుమలేశుడు సూర్యప్రభవాహనంలో ఊరేగారు. సాయంత్రం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, స్వామి వారి మూల మంత్ర హోమం, బలిహరణ అనంతరం ముత్యాల పందిరి వాహనంలో మాడవీధుల్లో ఊరేగారు.

కనుల పండువగా ద్వితీయ వార్షిక కల్యాణం

ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి పద్మావతి శ్రీనివాసుల కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. వందలాది మంది భక్తులు తిరుమలేశుడి కల్యాణాన్ని కనులారా తిలకించి పునీతులయ్యారు. మాంగల్యా ధారణ ముందు రుత్వికులు పుస్తెలను భక్తులకు చూపుతూ అనంతరం పద్మావతి అమ్మవారికి మాంగల్యాధారణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈ సమయంలో పూర్తిగా గోవింద నామస్మరణతో మార్మోగిపోయింది.

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత

పెదగంట్యాడ: న్యూపోర్టు పోలీస్ స్టేషన్ భవన మరమ్మతు పనులు పూర్తవడంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం దాన్ని పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పోలీస్ స్టేషన్ భవనం వర్షాలకు కారుతూ, కార్యాలయంలో ఉన్న ఫైళ్లు తడిసిపోతున్నాయని తెలుసుకుని పోలీస్ వెల్ఫేర్ సంక్షేమ నిధి నుంచి రూ. 2 లక్షలు కేటాయించి మరమ్మతులు చేయించినట్లు కమిషనర్ తెలిపారు. భవనం ప్రారంభం అనంతరం, పోలీస్ కమిషనర్ సిబ్బందితో సమావేశమయ్యారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీసీపీ-2 మేరీ ప్రశాంతి, హార్బర్ ఏసీపీ కాళిదాస్, న్యూపోర్టు సీఐ కామేశ్వరరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్‌ను ప్రారంభిస్తున్న చేస్తున్న నగర సీపీ శంఖబ్రత బాగ్చి

ఎమ్మెల్యే, మేయర్ దృష్టికి 68వ వార్డు సమస్యలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డులోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ కార్పొరేటర్ గుడివాడ అనూష లతీష్ శుక్రవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావును కౌన్సిల్ సమావేశంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

- అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ నుంచి పంచవటి వరకు ప్రధాన రహదారి విస్తరణ చేపట్టాలి.
- విశాఖ డెయిరీ నుంచి వెలుడే కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు విశాఖ డెయిరీ నుంచి పంచవటీకి కాలువ నిర్మాణంతో పాటు మింది తాగు నీటి ట్యాంకు నిల్వ సామర్థ్యం పెంచాలని కోరారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల విద్యా శాఖాధికారి రమణాజీ, సాహిత్య సుధ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాఘవాచార్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇవ్వడం శుభపరిణామమన్నారు. కథలు పుస్తకాలు చదివించడంతో పాటు ఆటల పోటీలు , చిత్ర లేఖనం, క్రాఫ్ట్స్‌లో శిక్షణ ఇచ్చామని గ్రంథాలయ శాఖాధికారి పీవీ రమణ తెలిపారు. అనంతరం శిబిరానికి హాజరైన విద్యార్థులకు, వివిధ పోటీల విజేతలకు బహుమతులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాంబాబు, పురుషోత్తం, నవ్య, లావణ్య, గణేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎంఈవో రమణాజీ